

మోటార్ వాహనాల మెకానిజంపై శిక్షణ

ప్రజాశక్తి - రామచంద్రపురం

ద్రాక్షారామ జడ్‌పి ఉన్నత పాఠశాలలో మంగళవారం మోటార్ వాహనాల మెకానిజం 450 మంది విద్యార్థులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. బివిసి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మోటారు వాహనాల మెకానిజం, మెయింటెనెన్స్, లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం వల్ల కలిగే ప్రమాదాలు, విపత్తు నిర్వహణ - అగ్ని ప్రమాద సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ వైవి.రమణ మూర్తి టీం గైడ్స్ టీచర్స్ గడ్డి వెంకటేశ్వరరావు, గోసాంగి నరసరాజు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్.రత్న పద్మావతి, ఒకేషనల్ ఉపాధ్యాయులురెడ్డి కనకరాజు, శేఖర్, అరవ విశ్వేశ్వరరావు ,జిల్లా సైన్స్ ఆఫీసర్ గిరజాల, వివిఎస్.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

తీరాన్ని మింగేస్తున్న ఆక్వా భూతం

- ఉప్పు కయ్యలుగా ఊళ్లు
- భవిష్యత్తులో మరింత ముప్పు

ప్రజాశక్తి - రాజోలు

అలనాటి గోదావరి పాయల సెలయేర్లు....పచ్చని తివాచీ పరిచినట్లుగా ఉండే పంట పొలాలు... ఆహ్లాదాన్ని పంచే కొబ్బరిచెట్లు ఇదీ కోనసీమ ప్రాంతం ప్రత్యేకత. ఇదంతా ఒకప్పటి మాట. ప్రస్తుత పరిస్థితి పూర్తి భిన్నం. ఆక్వా సాగు మోజులో కోనసీమ రూపురేఖల్ని మార్చేస్తున్నారు. ఎక్కడపడితే అక్కడ ఉప్పునీటి చెరువుల తవ్వకాలు పెచ్చుమీరిపోయాయి. దీంతో కోనసీమ ఉప్పుసంద్రంగా మారుతోంది. ఇక్కడి భూగర్భజలాలు మొత్తం ఉప్పుకయ్యలుగా మారిపోయాయి. దీంతో కోనసీమ ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడు తున్నారు. అధికారులు సైతం చెరువుల తవ్వకాలకు అడ్డగోలుగా అనుమతులిచ్చేయడంతో పచ్చని పంటభూములు, కొబ్బరి తోటలు సైతం రొయ్యల చెరువులుగా మారిపోయాయి. ఆక్వా చెరువుల అక్రమ సాగే జోరుగా సాగుతోంది. ప్రస్తుతం సముద్ర తీర ప్రాంతంలో ఉండే ఈ సాగు పచ్చని పొలాలను నాశనం చేస్తూ జిల్లావ్యాప్తంగా విస్తరిస్తోంది. వాతావరణం కలుషితమవ్వడమే కాకుండా పంట పొలాలు చౌడు బారిపోతున్నాయి. గతంలో ఆక్వా సాగుపై హైకోర్టు సైతం ఆగ్రహం వ్యక్తం చేసినా అధికారులు కళ్లు తెరవడం లేదు. కోనసీమతోపాటు జిల్లాలోని డెల్టా ప్రాంతంలోనూ అక్రమంగా సాగుచేస్తున్న ఆక్వా చెరువులతో పంట పొలాలు ఉప్పు బారినపడి చౌడుబారిపోతున్నాయి. డెల్టాలోనే అదే పరిస్థితి. రొయ్యల చెరువుల సాగు ఉన్న ప్రాంతంలోని రైతులంతా నష్టపోవాల్సి వస్తోంది. భూగర్భ జలాలు ఉప్పుబారిపోవడంతో పక్కన ఉన్న భూములు పంటల సాగుకు పనికిరాకుండా పోతున్నాయి. మత్స్యశాఖతోపాటుఆక్వా క్రియాసెన్సెస్ లేకుండా జిల్లాలో వేల ఎకరాల్లో చేపల, రొయ్యల చెరువుల సాగు చేస్తున్నారు.

అక్రమ ఆక్వా సాగు

జిల్లాలో అధికారికంగా కేవలం 40 వేల ఎకరాల్లోనే ఆక్వా సాగుకు అనుమతులున్నాయి. కానీ అనధికారికంగా సుమారు లక్ష ఎకరాల్లో సాగుచేస్తున్నట్లు అంచనా. అల్లవరం, ఉప్పలగుప్తం, కాట్రేనికోన, ముమ్మిడివరం, మలికిపురం, సఖినేటిపల్లి, మండలాల్లో లక్షల ఎకరాల్లో అనధికా రికంగా చేపల, రొయ్యల చెరువులు సాగువుతున్నాయి. కోనసీమలో మొత్తం ఆక్వా భూమి సుమారు రెండు లక్షల ఎకరాలు ఉండి. కానీ ఆక్వా సాగుకు కేవలం 10 వేల ఎకరాలకే అనుమతులు ఉన్నాయి. కానీ 40 వేల ఎకరాల్లో అనధికారికంగా ఆక్వా సాగువుతోంది. కేవలం మత్స్యశాఖ, రెవెన్యూ అధికారుల నుంచి అనుమతులు తెచ్చుకుని సాగుచేస్తున్నారు. వాస్తవానికి కోస్టల్ రెగ్యులేటరీ జోన్ పర్మిషన్ తప్పనిసరిగా ఉండాలి. వీటితోపాటు ఇరిగేషన్, సెంట్రల్ ఆక్వా అనుమతులూ ఉండాలి. వీటితోపాటు ఇరిగేషన్, మత్స్యశాఖ, రెవెన్యూ అనుమతులు ఉండాలి. కానీ దొడ్డిదారిన ఆమ్యామ్యాలతో మత్స్యశాఖ, రెవెన్యూ అధికారుల నుంచి అనుమతులు తెచ్చుకుని కొన్ని చోట్ల సాగు చేస్తున్నారు.


అంతర్వేది లో ఆక్వా సాగు కారణంగా మోడుబారిన కొబ్బరి చెట్లు(ఇన్‌సెట్)లో సఖినేటిపల్లి లో అక్రమ ఆక్వా సాగు

ఈ నిబంధనలు తప్పనిసరి

ఆక్వా సాగుకు కొన్ని మార్గదర్శకాలు తప్పనిసరిగా పాటించాల్సి ఉంది. కోస్టల్ రెగ్యులరైజేషన్ జోన్(సిఆర్‌జడ్) వెంట ఆక్వాసాగు నిషేధం. జిల్లా ఆక్వా అథారిటీ అనుమతి లేకుండగా సాగు చేపట్టకూడదు. నిబంధనలు అమలవుతున్న దాఖలాలు లేవు. కోనసీమలో యథేచ్ఛగా అక్రమంగా ఆక్వాసాగు పెద్దఎత్తున చేస్తున్నారు. గోదావరి పరివాహక ప్రాంతాల్లోను, ఏటిగట్లను ఆనుకుని ఉన్న లంకభూముల్లో ఆక్వా సాగు కొనసాగిస్తున్నారు. సిఆర్‌జడ్ నిబంధన ప్రకారం గోదావరి, ఏటిగట్టు మధ్య చెరువులు చేయకూడదన్న ప్రభుత్వ చట్టాన్ని అమలు చేసే నాథుడే లేదు. రక్షణగట్టుకు గోదావరికి మధ్యఉన్న భూముల్లో జిల్లా ఆక్వా అథారిటీ అనుమతి లేకుండగానే రొయ్యలసాగు చేపట్టి రూ.లక్షలు అర్జిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం పట్ల పలు అనుమానాలకు తావిస్తొంది.

ఉప్పునీటి బోరులు కోకొల్లలు

30 నుంచి 50శాతం సెల్‌నిటీ(ఉప్పు సాంద్రత) ఉన్న బోరులు కోనసీమలో కోకొల్లలు. దాదాపు 120 అడుగుల లోతులో అధిక ఉప్పు సాంద్రత కలిగిన ఈ నీటిని రొయ్యల సాగుకోసం బోరుల ద్వారా పైకి తోడుతున్నారు. ఉప్పునీటి బోరులు వేయకూడదన్న నిబంధన స్పష్టంగా ఉన్నా అమలు చేసే నాథుడే లేదు. అధిక ఉప్పు సాంద్రత ఉన్న నీటిని వినియోగించడం వల్ల సమీపంలోని బావులు సైతం ఉప్పుకయ్యలుగా మారిపోతున్నాయి. పంటపొలాలు సైతం చౌడుబారిపోతున్నాయి అడ్డగోలుగా అనుమతులు ఇచ్చేస్తుండటంతో కోనసీమలోని గ్రామాలకు తాగునీరు అందని ద్రాక్షగా మారింది.

గోదావరి మధ్యలో

ఏటిగట్టుకు గోదావరికి మధ్యలో పెద్దఎత్తున ఆక్వాసాగు చేస్తున్నారు. గోదావరి మధ్యలో ఇసుకమేటలను రొయ్యలు చెరువులుగా ఏర్పాటు చేసుకుని అక్రమార్కులులబ్ధిపొందుతున్నారు. అక్రమ ఆక్వాసాగు కారణంగా దుష్పరిణామాలు సంభవిస్తున్నా పట్టించుకునే నాథుడే లేదు. చెరువులకు వాడుతున్న రసాయన పదార్థాల కారణంగా పర్యావరణ సమస్య ఉత్పనమవుతోంది. అక్రమసాగుపై కనీస పర్యవేక్షణ కరవవ్వడం కోనసీమ ప్రజలకు శాపంగా మారింది.కనిసం పసువులకు కుడా తాగునీరు కరువైంది.

పొంచి ఉన్న పెను ముప్పు

ఆక్వా అక్రమసాగు వలన కోనసీమకు ముంపు ముప్పు పొంచి ఉంది. గోదావరి-రక్షణగట్టుకు మధ్య లంక భూములు రొయ్యల చెరువులుగా మారిపోవడంతో వరదల సమయంలో చెరువుగట్లు కోతకు గురయి రక్షణగట్టుకు ప్రమాదం ఏర్పడే అవకాశం అధికంగా ఉంది. నేరుగా వరద నీరు రక్షణగట్టును తాకి గండిపడే ప్రమాదం ఉంది. అంతేకాక గోదావరి నీటిని రొయ్యల చెరువులకు మళ్లించేందుకు రక్షణగట్టుకు రంధ్రంపెట్టి పైపులైన్లు ఏర్పాటు చేసుకున్నారు. రూ.కోట్లు వెచ్చించి ఆధునికీకరిస్తున్న ఏటిగట్లకు ఇటువంటి స్వార్థపరుల కారణంగా తీవ్రవిఘాతం కలుగుతోంది. కోనసీమలోని ఐ.పోలవరం, ముమ్మిడివరం, కాట్రేనికోన, ఉప్పలగుప్తం, అల్లవరం, మామిడికుదురు, సఖినేటిపల్లి, మల్కిపురం, రాజోలు తదితర మండలాల్లో నిబంధనలకు విరుధంగా సుమారు 20వేల ఎకరాలోల్లో ఆక్వా అక్రమసాగు యథేచ్ఛగా సాగిపోతోంది. అక్రమ ఆక్వాసాగు మీద స్థానికులు, రైతులు ప్రధానంగా కదం తొక్కుతున్నారు. ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా సాగు చేస్తున్న ఆక్వాచెరువులను ధ్వంసం చేసి కోనసీమలో పచ్చదనాన్ని, ప్రజాజీవితాన్ని కాపాడాల్సిన అవసరం ఉంది.

రాఘవులు గెలుపు కోసం విస్తృత ప్రచారం


ప్రచారం చేస్తున్న ప్రజాసంఘాలు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి డివి. రాఘవులుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ మండలానికి చెందిన ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక ప్రజాసంఘాలు మంగళవారం విస్తృత ప్రచారం నిర్వహించాయి. నగర పంచాయతీ పరిధిలో పలు ప్రభుత్వ, ప్రయి వేటు పాఠశాలలు, కళాశాలలు, విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలలో మంగళవారం సిఐటియు జిల్లా అధ్యక్షుడు జి.దుర్గా ప్రసాద్ ఆధ్వర్యంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సంఘాలు సంయుక్తంగా విస్తృత ప్రచారం నిర్వహిం చాయి. దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ ఉపాధ్యా యునిగా ఉపాధ్యాయ సంఘంలో వివిధ హోదాలలో పని చేసి ఉద్యోగ సమస్యలతో పాటు పలు కార్మిక, ప్రజా సమస్యలపై ప్రభుత్వాలపై నిరంతరం పోరాడే రాఘవులుకు ఈ నెల 27న జరిగే గ్రాడ్యు యేట్ ఎంఎల్ సి ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థిం చారు. ఈ ప్రచారంలో యుటిఎఫ్ సీనియర్ నాయకుడు రెడ్డి వీరస్వామి, నేరేడుమిల్లి అబ్బులు, వజ్రపు బాబాయ్, కాశీ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్‌సి ఎన్నికలకు మరో నామినేషన్

రెండుకు చేరిన నామినేషన్ల సంఖ్య

ప్రజాశక్తి - ఏలూరు

తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి మంగళవారం మరో నామినేషన్ దాఖలైంది. ఏలూరుకు చెందిన ములకల శ్రీనివాస్ నామినేషన్ దాఖలు చేశారు. ఏలూరు కలెక్టరేట్లో తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వికి ములకల శ్రీనివాస్ ఒక సెట్ నామినేషన్ పత్రాలను సమర్పించారు. నామినేషన్ వేసిన అభ్యర్థితో రిటర్నింగ్ అధికారి ప్రమాణం చేయించారు. సహాయ రిటర్నింగ్ అధికారి, ఏలూరు జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు, ఇతర ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు. పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి ఈ నెల మూడో తేదీన నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. ఇప్పటి వరకూ దాఖలైన నామినేషన్ల సంఖ్య రెండుకు చేరింది. ఇప్పటి వరకూ నామినేషన్లు వేసిన వారంతా ఇండిపెండెంట్ అభ్యర్థులే. ఎంఎల్‌సి ఎన్నికల బరిలో నువ్వా..నేనా అంటూ తలపడుతున్న పిడిఎఫ్, టిడిపి అభ్యర్థులు ఇంకా నామినేషన్లు వేయలేదు. ఆరు, ఏడు తేదీల్లో ఎక్కువగా నామినేషన్లు దాఖలయ్యే అవకాశం కనిపిస్తోంది. ఈ నెల పదో తేదీ వరకూ నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కొనసాగనుంది. నామినేషన్ల స్వీకరణకు సంబంధించి అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు.

సాగునీరు అందించేందుకు చర్యలు

ప్రజాశక్తి - ఆలమూరు

కాలువలను పరి శుభ్రం చేసి సాగునీరును సక్రమంగా శివారు ప్రాంత పొలాలకు వెళ్ళే విధంగా చర్యలు చేపడతామని సాగునీటి సంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీనివాస్ చౌదరి అన్నారు. మండలంలోని చింతలూరు కొత్త కాలువ పూడిక తీత పనులను మంగళవారం ఆయన ప్రారంభించి పర్యవేక్షించారు. ఉపాధి కూలీలతో కలిసి పూడికను తీశారు.


కూలీలతో పనులు కలసి ప్రారంభిస్తున్న అధ్యక్షుడు శ్రీనివాస్


అభినందిస్తున్న ఎంపిటిసి సభ్యురాలు

వన్నె చింతలపూడి విద్యార్థులకు అభినందన

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

వన్నె చింతలపూడి జడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులు పి.రోహిణి, ఎస్.శశివదనలను మంగళవారం పాఠశాలలో హెచ్‌ఎం జి.నాగ సత్యనారాయణ ఆధ్వర్యం లో స్థానిక ఎంపిటిసి సభ్యులు పరమట నాగమణి, విష్ణు ప్రసాద్ అభినందించారు. ఇటీవల విద్యార్థులు తయారుచేసిన మల్టీపర్పస్ సైక్లింగ్ మిల్లర్ ప్రాజెక్టు జాతీయస్థాయిలో ద్వితీయ స్థానం సాధించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఎంపిటిసి మాట్లాడుతూ విద్యార్థులను భవిష్యత్తులో ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో సాంకేతిక విద్యను పెంపొందించుకుంటూ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని ఆకాంక్షించారు. ఇటువంటి ప్రాజెక్టులు ఎన్నో తయారుచేసి ఉన్నత స్థాయికి వెళ్లాలని, తల్లిదండ్రులకు, పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. అదేవిధంగా గైడ్ చేసిన ప్రధానోపాధ్యాయులు నాగ సత్యనారాయణ, ప్రాజెక్ట్ టీచర్ ప్రకాష్‌ని అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం గైడ్ ఉపాధ్యాయులను సన్మానించి విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఛైర్మన్ ఎస్.ముత్యాల బాబు, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, పీడీ కె.గణేశ్వరరావు, సిఆర్‌పి ఎన్.కుమారి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



రైతులకు ఇకెవైసి తప్పనిసరి

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

రైతు సేవా కేంద్రాల్లో రైతులు తప్పనిసరిగా ఇకెవైసి చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి .వి బోసు బాబు అన్నారు. కపిలేశ్వరపురం మండలం లోని వడ్లమూరు రైతు సేవా కేంద్రం వద్ద మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వి.బోసుబాబు, వ్యవసాయ సహాయ సంచాలకులు కె.నాగేశ్వరరావు,మండల వ్యవసాయ అధికారి కెవిఎన్.రమేష్ కుమార్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు మాట్లాడుతూ వరి చేలలో వచ్చే తెగుళ్ల, పురుగులు,వాటి లక్షణాలు, నియంత్రణ, కేంద్రం ప్రభుత్వం ద్వారా అమలు చేస్తున్న ఎన్ పి ఎస్ ఎస్ యాప్, తదితర అంశాలపై రైతులకు వివరించారు . అలాగే ఈ నెల 6న సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మండలం లోని 17 రైతు సేవా కేంద్రాల ద్వారా ఎలుకల నివారణకు బ్రోమోడయోలిన్ మందును రైతులకు. ఉచితంగా పంపిణీ చేస్తారన్నారు. సహాయ వ్యవసాయ సంచాలకులు కె. నాగేశ్వరరావు మాట్లాడుతూ రబి పంటలో ఎరువులు యాజమాన్యం, సరైన సమయంలో వాడవలసిన ఎరువులు , క్రాప్ ఇన్సూరెన్సు ,సాయిల్ హెల్త్ కార్డ్స్, ఇకెవైసి తదితర వాటిపై రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో.ఎఒ కెవిఎన్.రమేష్‌కుమార్, గ్రామ వ్యవసాయ సహాయకురాలు బి. ప్రియాంక, చుండ్రు వీర వెంకట్రావు చౌదరి, పుచ్చకాయల రామారావు, పుట్ట వెంకన్నబాబు, గ్రామ పెద్దలు, రైతులు, తదితరులు, పాల్గొన్నారు. **కె.గంగవరం:** భూసార పరీక్షలు ఆధారంగా రైతులు ఎరువులు వెయ్యాలని రామచంద్రపురం సహాయ వ్యవసాయ సంచాలకులు ఏ ఎస్ వి



కుడుపూరులో పొలం పిలుస్తుంది కార్యక్రమం



వడ్లమూరులో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి బోసుబాబు

రంగారావు తెలియజేశారు. పొలం పిలుస్తోంది కార్యక్రమం లో భాగంగా మంగళవారం కుడుపూరు గ్రామా%శీ% లో కార్యక్రమం నిర్వహించారు. రైతులకు దాళ్వా వ్యవసాయం లో మెళుకువలు, తొలకరి లో సేకరించిన మట్టి నమూనా పరీక్షల ఫలితాలను తెలియ చేశారు. ఈ నెల 6 వ తేదీ గురువారం అన్ని రైతు సేవా కేంద్రాలలో సామూహిక ఎలుకల నిర్మూలనా కార్యక్రమం లో భాగంగా బ్రోమోడైలిన్ అనే మందు నూకలు నూనె తో కలిపిన ఏర మందు పంపిణీ చేస్తామని ఈ కార్యక్రమాన్ని రైతు లు అందరూ ఉపయోగించుకోవాలని తెలియజేసారు ఈ కార్యక్రమంలో కుడుపూరు గ్రామ సర్పంచ్ పిల్లి రాంబాబు మండల వ్యవసాయ అధికారి బి రవి గ్రామ వ్యవసాయ సహాయకులు రైతులు పాల్గొన్నారు.

కిశోర బాలికల వికాసంపై అవగాహన


మాట్లాడుతున్న ఎంఇఒ పివి.సుబ్బరాజు

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని చెము డులంక ఎస్‌టి ఎస్ఎన్ఎం జడ్‌పి హైస్కూ ల్లో మంగళవారం కిశోర బాలికల వికాసంపై ఐసి డిఎస్ ఆధ్వర్యంలో హెచ్ఎం శ్రీరామ్‌కుమార్ అధ్యక్షతన విద్యార్థినులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ పివి.సుబ్బ రాజు మాట్లా డుతూ కిశోర బాలికల వ్యక్తిత్వ వికాసం వృద్ధి చెందేలా అందరూ సమిష్టిగా కృషి చేయాలని పిలుపు నిచ్చారు. ఇందులో వ్యక్తిగత ఆరో గ్యం, రక్తహీనత, మహిళా అక్రమ రవాణా, లింగ వివక్ష, బాల్య వివా హాలు నిర్మూలనకు తీసు కోవలసిన జాగ్రత్తలను వారు వివరించారు. విద్యార్థినులు ఎదుర్కొ ంటున్న సమస్యలను ఉపాధ్యాయులు తెలుసు కుని సత్వరమే పరిష్కరిం చాలని వారు సూచించారు. ఈ కార్యక్రమ ంలో వెల్ఫేర్ అసిస్టెంట్ దుర్గా, ఎఎన్ఎం మంగాయమ్మ, సూపర్ వైజర్లు టిఎన్‌వి.నాగలక్ష్మి, వై.అరుం ధతి, సిఆర్‌పి శ్రీనివాస్, అంగన్ వాడీలు సుశీల, ఉపాధ్యా యులు, తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థినిలకు గ్రామర్ పుస్తకాల అందజేత

వ్యాకరణ పుస్తకాలతో భాషా పరిజ్ఞానం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

విద్యార్థులు భాషాపరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి గ్రామర్ పుస్తకాలు ఎంతో దోహదం చేస్తాయని రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు పితాని వీర వెంకట సత్యనారాయణ పేర్కొన్నారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక జడ్‌పి బాలికోన్నత పాఠశాల లో మంగళ వారం ప్రధానోపాధ్యాయిని పరిమళ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. రిటైర్డ్ హెచ్‌ఎం సత్యనారాయణ తల్లిదండ్రులు జ్ఞాపకర్థం 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థినిలకు తెలుగు, ఇంగ్లిష్ గ్రామర్, జనరల్ నాలెడ్జ్‌కు సంబంధించిన పుస్తకాలను ప్రధానోపాధ్యాయిని చేతులు మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ గత నాలుగు దశాబ్దాలు గా పుస్తకాలను పంపిణి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినిలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కలుపు నివారణకు చర్యలు

ప్రజాశక్తి - మామిడికుదురు

సాగునీటి వనరుల ద్వారా వ్యాపించే నీటి తామర, సాల్వినియా, అంతర తామర వంటి కలుపు మొక్కల నివారణ, ప్రారంభ దశలో అగ్గి తెగులు, కాండము తొలిచే పురుగులను ముందుగా గుర్తించి చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయ సాంకేతిక సలహా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.నంద కిషోర్, వ్యవసాయ అధికారి మనోహర్‌లు రైతులకు పలు సూచనలు చేశారు నగరంలో క్షేత్రస్థాయిలో మంగళవారం పంట పొలాలు పరిశీలించారు. కలుపు నివారణకు, కాండము తొలిచే పురుగు నివారణ, అగ్గి తెగులు నివారణ పలు అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ క్షేత్ర సందర్శనలో పి.గన్నవరం వ్యవసాయ సహాయ సంచాలకులు ఎస్‌జె వి.రామ్మోహన్ రావు, మండల వ్యవసాయాధికారిణి బి.మృదుల, గ్రామ విఎఎ, రైతులు తాటికాయల ఉదయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహనా సదస్సులు

ప్రజాశక్తి - యంత్రాంగం


జిల్లాలో పలు చోట్ల రోడ్డు భద్రతపై మంగళవారం అవగాహనా సదస్సులు నిర్వహించారు. వివరాలు ఇవి.

అమలాపురం రూరల్: భట్నవిల్లి హైవే వద్ద ద్విచక్ర వాహనాదారులకు సిఐ ప్రశాంత్ కుమార్ మంగళవారం రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన హెల్మెట్ ధరించాలని వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం రోడ్డు భద్రతపై వాహనదారులచే ప్రతిజ్ఞ చేయించారు. **కె.గంగవరం:** మండల ఆటో యూనియన్ సభ్యులతో రోడ్డు భద్రత అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. కె.గంగవరం ఎస్‌ఐ జానీ భాష సమావేశంలో మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు డ్రైవర్లు తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సంబందిత వాహన పత్రాలను తప్పనిసరిగా కలిగి ఉండాలని, వాహనాలలో ఎక్కువ మంది ప్రయాణికులను ఎక్కించుకోరాదన్నారు. పాఠశాలలకు చిన్నపిల్లలను తీసుకుని వెళ్లే ఆటో డ్రైవర్లు సదరు ఆటోలో తక్కువ మంది పిల్లల్ని మాత్రమే ఎక్కించుకోవాలని, ఆటో డ్రైవర్లు వాహనం యొక్క ఫిట్ నెస్ సర్టిఫికెట్ ఉండాలన్నారు. వాహనదారులు ఎట్టి పరిస్థితుల్లో కూడా మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు. మద్యం తాగి నడిపితే కేసు నమోదు చేస్తామని తెలియజేశారు. మద్యం తాగి పట్టుబడితే రూ.10,500 జరిమానా మూడు రోజుల వరకు జైలు శిక్ష వేస్తారని డ్రైవర్లకు వివరించారు. ప్రతీ ఒక్కరు కూడా జాగ్రత్తగా వాహనాలను నడిపి క్షేమంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశానికి 100 మంది ఆటో డ్రైవర్లు ఆటోలతోపాటు హాజరయ్యారు. **ముమ్మిడివరం:** ప్రతీ ఒక్కరూ రహదారి భద్రత నియమాలను పాటించడం ద్వారా ప్రమాధాలను అరికట్టవచ్చునని ముమ్మిడివరం ఎస్‌ఐ డి.జ్వాలా సాగర్ సూచించారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ప్రిన్సిపల్ డాక్టర్ ప్రభాకర్ అధ్యక్షతన 'రహదారి భద్రత - డ్రంక్ అండ్ డ్రైవ్'పై జరిగిన అవగాహనా సదస్సుకు జ్వాలా సాగర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పనిసరిగా దరించాలని, అతి వేగం ప్రమాదకరమని, ఎట్టి పరిస్థితుల్లోను మద్యం తాగి వాహనం నడపరాదనీ, వేగం కంటే ప్రాణం ముఖ్యమని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రారంభమైన అంతర్వేది కల్యాణోత్సవాలు

ప్రజాశక్తి- సఖినేటిపల్లి

అంతర్వేది శ్రీ లక్ష్మీనరసింహస్వామి తిరు కళ్యాణోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయని ఆర్‌డిఒ కె.మాధవి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 4వ తేదీ నుంచి 13వతేదీ వరకు ఉత్సవాల నిర్వహణకు కలెక్టర్ ఆధ్వర్యంలో నాలుగు తపాలు సమావేశాలు నిర్వహించామన్నారు. ఉత్సవాలకు సంబంధించి అన్ని శాఖల అధికారులతో ఉత్సవాలు నిర్వహణకు సంబంధించి విధులు కేటాయించామని అన్నారు. ఉత్సవాలకు ఈ పది రోజులలో ఐదు లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేశామన్నారు. 1600 మంది పోలీసులను, శాంతిభద్రతల పరిరక్షణకు, పారిశుధ్య నిర్వహణకు 270 మందిని మొత్తం 1800 మందిని మూడు షిఫ్టులలో విధులు నిర్వహణకు కేటాయించామని అన్నారు. రెవెన్యూ పంచాయతీ ఆర్డబ్ల్యూఎస్ తదితర శాఖలలో ఉద్యోగులకు విధులు బాధ్యతలు అప్పగించామన్నారు. సుమారుగా 120 మొబైల్ మరుగుదొడ్లు యాత్రికుల సౌకర్యార్థం ఏర్పాటు చేశామన్నారు. 50 సత్రాలలో భక్తులకు ఉచిత అన్నదాన ఏర్పాట్లు చేశామన్నారు. రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ బృందం కూడా నియమించా మన్నారు. కళ్యాణోత్సవానికి 1500 టిక్కెట్లు కేటాయించామ న్నారు. యాత్రికుల కొరకు వైద్య ఆరోగ్యశాఖ 5 ఉచిత వైద్య శిబిరాలను అత్యవసర వైద్య సేవల కొరకు 108 సంచార వైద్య సేవల కొరకు 104 వాహనాలను కూడా ఏర్పాటు చేశామన్నారు. రోజువారి కార్యక్రమాలను పాత్రికేయులకు వివరిస్తామన్నారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ వి. సత్యనారాయణ, ఛైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ శ్రీరాజా కలిదిండి కుమార రామగోపాల రాజా బహుద్దూర్, ఉత్సవ కమిటీ ఛైర్మన్ డి.బాలాజీ, సఖినేటిపల్లి తహశీల్దార్ ఎం.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్‌డిఒ


అంబాజీపేట పిహెచ్‌సి ఆధ్వర్యంలో ర్యాలీ పాల్గొన్న వైద్యబృందం

కేన్సర్ నిర్మూలనకు కృషి చేయాలి

ప్రజాశక్తి - యంత్రాంగం

ప్రతీ ఒక్కరూ కేన్సర్ నిర్మూలనకు కృషి చేయాలని పలువురు వైద్యులు అన్నారు. వరల్డ్ కేన్సర్ డే సందర్భంగా పలుచోట్ల అవగాహనా ర్యాలీలు మంగళవారం నిర్వహించారు.

అమలాపురం: యుక్త వయస్సులో విద్యార్థునులు పలు విషయాల్లో జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ స్రవంతి అన్నారు. అమలాపురం ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశాలలో వరల్డ్ కేన్సర్ డే సందర్భంగా జనసేన నాయకులు కల్వకొలను తాతాజీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో లయన్స్ అధ్యక్షులు సప్పా నాగేశ్వరరావు, ప్రధాన ఉపాధ్యాయులు పమ్మి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. **అంబాజీపేట:** కేన్సర్ పట్ల ప్రతీ ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పిహెచ్‌సి వైద్యాధికారి కెఎన్.శ్రీనివాస్ అన్నారు. అంతర్జాతీయ కేన్సర్ దినోత్సవం సందర్భంగా మంగళవారం అంబాజీపేట పిహెచ్‌సి ఆధ్వర్యంలో క్యాన్సర్ రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఒ .అప్పారావు ఎంపిహెచ్ఎ(ఎమ్), ఎఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిలు, స్టాఫ్‌నర్స్‌లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు. **ఆలమూరు:** ఆరోగ్యకరమైన జీవనశైలిని అవలంభించడంతో పాటు దురలవాట్లకు దూరంగా ఉంటే కేన్సర్‌ను సమూలంగా నయం చేయవచ్చునని చొప్పెల్ల, పెదపళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డి.సువర్చలాదేవి, డి.సాయికిషోర్ అన్నారు. మండలంలోని ఆయా పిహెచ్‌సిల్లో ప్రపంచ కేన్సర్ దినోత్సవంలో వారి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. వైద్య ఆరోగ్య ఆశ సిబ్బంది వివిధ గ్రామాల్లోని పుర వీధుల్లో క్యాన్సర్ నివారణకు తీసుకోవసిలని జాగ్రత్తలను వివరిస్తూ ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్లు ఎవివి.రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాస రావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలామణి, తదితరులు పాల్గొన్నారు.


చొప్పెల్లలో నిర్వహించిన ర్యాలీలో మాట్లాడుతున్న డాక్టర్ సువర్చల

ఇసుక తవ్వకాలకు అనువైన రీచ్‌లను గుర్తించాలి


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్

ప్రజాశక్తి - అమలాపురం

జిల్లాలో వశిష్ట, గౌతమి నదులలో ఇసుక తవ్వకాలకు అనువైన రీచ్లను గుర్తించి అనుమ తులు మంజూరు కొరకు సంబంధిత అధికారులు సమన్వ యంతో కషి చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదేశించారు. మంగళ వారం కలెక్టరేట్ జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహించి పట్టా భూములలో ఇసుక మేటలు తవ్వకాలకు సంబంధించి వచ్చిన దరఖాస్తులపై క్షేత్రస్థా యిలో విచారణ సర్వే నివేదిక అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఇసుక రీచ్ లను పార్సిల్ మ్యాపులను కలెక్టర్ తిలకించారు. ఈ కార్యక్రమంలో జిల్లా భూగర్భ గనులు శాఖ అధికారి ఎల్ వంశీధర్ రెడ్డి జిల్లా కాలుష్య నియంత్రణ మండలి కార్యనిర్వాహక ఇంజినీర్ శంకర్రావు, డిస్ట్రిక్ జిఐఎస్ అధికారి లీర్తి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా రీసర్వే నిర్వహించాలి

పారదర్శకంగా, కచ్చితత్వంతో రీసర్వేఎ లాంటి తప్పిదాలకు తావు లేకుండా కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ రెవెన్యూ, సర్వే అధికారులను ఆదేశించారు మంగళవారం రాష్ట్ర భూ పరిపాలన ముఖ్య కమిషనర్ కార్యాలయపు ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎన్ ప్రభాకర్ రెడ్డి 26 జిల్లాల కలెక్టర్లు, జెసిలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి రీ సర్వే ప్రక్రియలో పురోగతి ఆన్లైన్ డేటా ఎంట్రీ, గ్రామ సభల నిర్వహణ అర్జీల పరిష్కారం, గ్రౌండ్ ట్రూతి ంగ్ గ్రౌండ్ వాల్యుయేషన్, సిటిజెన్ సర్వీసెస్ ఇత్యాది అంశాల పురోగతిపై జిల్లాల వారీగా సమీక్షించారు.

ఆక్వారంగ చెరువుల ధ్వంసంపై సమీక్ష

స్థానిక కలెక్టరేట్ మంగళవారం నందు రెవెన్యూ, మత్స్యశాఖ, ట్రాన్స్కో అధికారులతో సమావేశం నిర్వహించి జాతీయ హరిత ట్రిబ్యునల్ నిబంధనలను ఉల్లంఘించిన ఆక్వా రంగ చెరువుల ధ్వంసం ప్రక్రియపై కలెక్టర్ ఆర్.మహేష్కుమార్ సమీక్షించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ హరిత ట్రిబ్యునల్ నిబంధనలను ఉల్లంఘించినట్లు ధ్రువీకరించిన ఆక్వారంగ చెరువులను మార్చి నాటికి పూర్తిగా ధ్వంసం చేయాలని అధికారులను ఆదేశించారు. మామిడి కుదురు మండ లంలో 193 చెరువులను గుర్తించగా వీటిలో ఇప్ప టివరకు 47 చెరువులను ధ్వంసం చేశారన్నారు. అదేవిధంగా మల్కిపురం మండలంలో 35 చెరువులను గుర్తించగా 19 చెరువులను ధ్వంసం చేసినట్లు 8 చెరువులు ధ్వంసం చేయడానికి సిద్ధంగా ఉన్నాయన్నారు సఖినేటిపల్లి మండలంలో 206 చెరు వులను గుర్తించగా వీటిని అంతర్వేది శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దివ్య తిరు కళ్యాణోత్సవాలు ముగిసిన పిదప ధ్వంసం చేస్తారన్నారు. దశలవారీగా నిబంధనలకు విరుద్ధంగా ఉన్న చెరువులలో చేపల హార్వెస్టింగ్ ప్రక్రియ పూర్తయిన వెంటనే విద్యుత్ కనెక్షన్ ను తొలగించి ధ్వంసం చేయడానికి చర్యలు చేప ట్టాలన్నారు. విద్యుత్ కనెక్షన్ తొలగించి ధ్వంసం చేసిన చెరువుల్లో మరలా సాగును పున్ల ప్రారంభిం చినట్లయితే అందుకు సంబంధిత మత్స్య అభివృద్ధి అధి కారి పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే ఆక్వా చెరువుల రైతాంగానికి ఆరు మాసాలు గడువును ఇచ్చామన్నారు. మార్చి 15 నాటికి మొత్తం చెరువు లను ధ్వంసం చేయాలని ఆదేశించారు. జెసిబి లు సంఖ్యను పెంచి త్వరితగతిన చెరువులను ధ్వంసం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జెసి టి.నిసాంతి, ఆర్డిఒ కె.మాధవి జిల్లా మత్స్య శాఖ అధికారి ఎన్ శ్రీనివాసరావు, ట్రాన్స్కో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సిహెచ్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

ప్రజాశక్తి - రామచంద్రపురం

పట్టణం 7వ వార్డులోని గణేష్ నగర్ రైలు గట్టు పక్కన ఒక మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ జరిగినట్లు పోలీసులు తెలిపారు. మంగళవారం ఉదయం కడియాల పార్వతి అనే మహిళ ఇంటిముందు టులెట్ బోర్డు చూసి ఇల్లు చూపించాలని ఒక వ్యక్తి అడిగాడు. దీనితో ఇంట్లో ఉన్న కడియాల పార్వతి ఇల్లు చూపిస్తుండగా ఆమె మెడలో గొలుసు లాక్కుని పారిపోయాడు. గుర్తుతెలియని వ్యక్తి మాస్క్ ధరించి ఉన్నాడు. తాడు లాగుతూన్న సమయంలో పార్వతి కింద పడిపోగా ఆమెను రామచంద్రంపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న రామచంద్రపురం సిఐ వెంకటనారాయణ, ఎస్ఐ నాగేశ్వరరావు విచారణ చేపట్టారు. నాలుగు కాసులు బంగారు గొలుసు లాక్కుని పారిపోయినట్లు పార్వతి పోలీసులకు వివరించింది. దీనిపై కేసు నమోదు చేసి ఎస్ఐ నాగేశ్వరరావు దర్యాప్తు చేస్తున్నారు.


ఘటనాప్రాంతాన్ని పరిశీలిస్తున్న క్రైం అడిషనల్ ఎస్పి

అచ్చన్నపాలెంలో భారీ చోరీ

45 కాసుల బంగారం, రూ.2లక్షల నగదు అపహరణ

ప్రజాశక్తి - నల్లజర్ల

నల్లజర్ల మండలం అచ్చన్నపాలెం గ్రామంలో భారీ చోరీ జరిగింది. వట్టికూటి రామారావు ఇంట్లో సోమవారం రాత్రి గుర్తు తెలియని దొంగలు ప్రవేశించి సుమారు 45 కాసులు బంగారం, రూ. 2 లక్షల నగదు అపహరించుకుపోయారు. సిఐ నక్క శ్రీనివాస్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీం ఆధారాలు సేకరించింది. అడిషనల్ ఎస్పి(క్రైం) అర్జున్ తెలిపిన వివరాల మేరకు రామారావు కుటుంబ సభ్యులు ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని దొంగలు వెనుక ఉన్న గది నుంచి ఇంట్లోకి చొరబడ్డారన్నారు. బంగారు నగలు, నగదుతో ఉడాయించారన్నారు. ఇప్పటికే క్లూస్ టీమ్ ఘటనా ప్రాంతంలో ఆధారాలు సేకరించిందన్నారు. పాత నేరస్తుల వివరాలు, సిసి కెమెరా పుటేజీలను పరిశీలిస్తున్నామనారు. త్వరలోనే దొంగలను పట్టుకుంటామని తెలిపారు ఇళ్ల వద్ద సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ప్రజలకు సూచించారు. ఆయన వెంట డిఎస్పి జి.దేవకుమార్, సిఐలు ఎన్.శ్రీనివాస్, నాయక్, ఎస్ఐ ఎం.సోమరాజు, సిబ్బంది ఉన్నారు.

పేకాడుతున్న ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని దుర్గాడ గ్రామ శివారు పేకాట ఆడుతున్న సమాచారంతో మంగళవారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పేకాడుతున్న గుల్ల అబ్బాయి, మర్రెడ్డి నూకరాజులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.4,200 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు

ట్రాక్టర్‌ను ప్రారంభించిన జ్యోతుల

ప్రజాశక్తి-గోకవరం

మండలంలోని తంటికొండ గ్రామానికి చెందిన టిడిపి గ్రామ అధ్యక్షుడు నాగం వెంకటపతి ఇటీవల కొనుగోలు చేసిన నూతన ట్రాక్టర్‌ను మంగళవారం కాకినాడ జిల్లా అధ్యక్షులు, జడ్పి మాజీ జ్యోతుల నవీన్‌కుమార్ ప్రారంభించారు. తంటికొండ శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రథసప్తమి వేడుకలకు హాజరైన నవీన్ ఈ నూతన ట్రాక్టర్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.


దగ్ధం అవుతున్న అడవి

అటవీప్రాంతంలో మంటలు

ప్రజాశక్తి - రాజానగరం

మండలంలో దివాన్ చెరువు ప్రాంతం బ్రిడ్జి కౌంటీ వెనుక అటవీప్రాంతంలో మంటలు చెలరేగాయి. సుమారు ఐదు హెక్టార్ల అడవి దగ్ధమైంది. మంటలతో రహదారిపై వరకూ దట్టమైన పొగ వ్యాపించింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జిల్లా అగ్ని మాపక అధికారి బి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో రాజ మహేంద్రవరం, కోరుకొండ అగ్నిక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

అమలాపురం ఎలక్ట్రికల్ ఇఇ ఆకస్మిక బదిలీ

ప్రజాశక్తి - అమలాపురం

అమలాపురం ఎలక్ట్రికల్ ఇఇగా విధులు నిర్వహిస్తున్న మోకా రవికుమార్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఆచంట డిప్యూటీ ఇఇగా పనిచేస్తున్న కె.రాంబాబును అమలాపురం ఉద్యోగోన్నతిపై బదిలీ అయ్యి వస్తున్నారు. మూడేళ్లగా అమలాపురంలో పనిచేస్తున్న రవికుమార్‌ను రాజ మహేంద్రవరం టెక్నికల్ డిఇగా బదిలీచేశారు. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

స్వామి వారి కల్యాణోత్సవాల్లో పాల్గొన్న వైసిపి కో-ఆర్డినేటర్

ప్రజాశక్తి - మామిడికుదురు

పాశర్లపూడి లంకలో పి.గన్నవరం నియోజకవర్గ వైసిపి కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు పార్టీ శ్రేణులతో కలిసి మంగళవారం శ్రీ వల్లి దేవ సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవాల ముగింపు సందర్భంగా స్వామివారిని దర్శించుకున్నారు. అర్చకులచే వేద ఆశీర్వాదం తీసుకుని అక్కడ ఏర్పాటు చేసిన అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఆయన వెంట పలువురు నాయకులు ఉన్నారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి

ప్రజాశక్తి - రావులపాలెం

ప్రతీ విద్యార్థి క్రమశిక్షణ కలిగి విద్యనభ్యశించినట్లయితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని తణుకు చెందిన రిటైర్డ్ ప్రిన్సిపల్, కెరీర్ గైడెన్స్ కమిటీ ఛైర్మన్ పోడూరి రాధా పుష్పావతి అన్నారు. మండల పరిధి పొడగట్లపల్లి ఓరియంటల్ ఉన్నతపాఠశాలలో మంగళవారం కెరీర్ గైడెన్స్ కమిటీ సభ్యులు కటారి శారదా దేవి, తణుకు మానవత స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షుడు కటారి కాశీవిశ్వ నాథరాజు సౌజన్యంతో ఎస్ఎంసి ఛైర్మన్ జాలాది సహదేవుడు ఆధ్వర్యంలో హెచ్ఎం వంశీ కృష్ణ అధ్యక్షతన 10 వ తరగతి మోటివేషన్ తరగతులకు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా కెరీర్ గైడెన్స్ కమిటీ ఛైర్మన్ డాక్టర్ కోడూరి రాధా పుష్పావతి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పబ్లిక్ పరీక్షల్లో ప్రతిభ కనబర్చేలా విద్యార్థులకు మనోధైర్యాన్ని కల్పించారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించి తల్లిదండ్రులకు,గురువులకు పేరుప్రఖ్యాతులు తీసుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం కటారి శారదా దేవి విశ్వనాథరాజు సమకూర్చిన ఫైల్స్, మెమెంటో, ప్రశంసాపత్రాలు 9,10 తరగతుల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ముఖ్య అతిధులు చేతులు మీదుగా అందజేశారు. ఈకార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు అల్లూరి పెద కృష్ణంరాజు, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు అల్లూరి గోపాలరాజు,సఖినాల గణపతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు హాజరయ్యారు.


విద్యార్థులకు స్టడీమెటీరియల్, మెమొంటోలు అందజేస్తున్న మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ

ముద్రగడ ఇంటిపై దాడి దుర్మార్గపు చర్య

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

ఉద్యమ నేత, వైసిపి సీనియర్ నాయకుడు మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ఇంటిపై జనసేన కార్యకర్త దాడికి పాల్పడడం దుర్మార్గపు చర్య అని వైసిపి నాయకులు ధ్వజమెత్తారు. ఉప్పలగుప్తంలోని మాజీ రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చీకట్ల కిషోర్ ఇంటి వద్ద మంగళవారం వైసిపి రాష్ట్ర కార్యదర్శి దంగేటి రాంబాబు అధ్యక్షతన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. వైసిపి నాయకులు మాట్లాడుతూ ముద్రగడ ఇంటి ఆవరణలో ఉన్న ముద్రగడ కారును ఢీ కొట్టి భయభ్రాంతులకు గురిచేసిన ఈ సంఘటన పై కూటమి ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. ఉద్యమ నేతగా ఎంతో పేరున్న పద్మనాభం స్వగృహంలో బీభత్సం సృష్టించడమే కాకుండా తాను జనసేన పార్టీకి చెందిన వ్యక్తినని బాహాటంగా చెప్పడం కూటమి ప్రభుత్వం ఆలోచన విధానం ఏమిటనేది స్పష్టమైందన్నారు. .ఇటువంటి దాడులకు అరాచక సంస్కృతికి స్వస్తి పలక పోతే తగిన మూల్యం చెల్లించుకోవలసి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో సర్పంచ్ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు, సర్పంచ్ లు యర్రంశెట్టి రామచంద్రరావు జొన్నాడ శ్రీదుర్గ, ఎంపిటిసి సభ్యురాలు వంగా గిరిజకుమారి, వైసిపి రైతు విభాగం జిల్లా అధ్యక్షులు జిన్నూరి వెంకటేశ్వరరావు, ఐటి విభాగం అధ్యక్షులు తోరం గౌతమ్ రాజా, రాష్ట్ర నాయకులు వంటెద్దు వెంకన్న నాయుడు, వైసిపి మండల కార్యదర్శి పినిపే జయరాజు, యువజన విభాగం మండల అధ్యక్షుడు ఓగూరి విజయకుమార్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

ఆలయాలకు విరాళాలు అందజేసిన దాతలు

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలోని అప్పనపల్లిలోని బాలబాలజీ స్వామి ఆలయంలో నిత్యాన్నదానానికి, చింతలూరు శ్రీ భూసమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలకు దాతలు మంగళవారం విరాళం అందజేశారు.

మామిడికుదురు : అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ దేవస్థానం శాశ్వత నిత్యాన్న దాన ట్రస్ట్కు కానూరు వాసులు చోడపనేడి శ్రీరామ్ లక్ష్మీచాముండేశ్వరి కుటుంబ సభ్యులు రూ.10,116 విరాళంగా ఇచ్చారని ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణ రాజు మంగళవారం తెలిపారు దాత దంపతులను స్వామివారి ప్రత్యేక దర్శనం చేయించి స్వామి వారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. **ఆలమూరు:** చింతలూరు శ్రీ భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 17 నుంచి జరగనున్న పాంచాహ్నిక బ్రహోత్సవాలకు ఆలమూరుకు చెందిన పారిశ్రామికవేత్త వట్టికూటి సతీష్ బాబుతో పాటుగా కుటుంబసభ్యులు రూ.1,00,005 భారీ విరాళం అందజేశారు. ఈ మొత్తాన్ని బ్రహ్మోత్సవాల్లో నిర్వహించే తోమాల సేవ నిమిత్తం వినియోగించమని వారు తెలిపినట్లు నిర్వాహకులు తెలియజేశారు. విరాళం అందించిన వట్టికూటి సతీశ్‌బాబు, కుటుంబ సభ్యులను పలువురు అభినందించారు.


అప్పనపల్లిలో దాతకు చిత్రపటం అందిస్తున్న ఆలయ అర్చకులు

వెల్ల ఆరోగ్య కేంద్రంలో స్పర్శపై అవగాహన

ప్రజాశక్తి - రామచంద్రపురం

మండలంలోని వెల్ల గ్రామంలో మంగళవారం స్పర్శ పై అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా డిప్యూటీ పేరా మెడికల్ ఆఫీసర్ మాధవరపు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఫిబ్రవరి 13వ తేదీ వరకు స్పర్శ ప్రోగ్రాంలో భాగంగా ఆశా కార్యకర్తలంతా ఇంటింటికి వెళ్లి కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించి ప్రారంభ దశలో వ్యాధిని గుర్తించి అంగవైకల్యం రాకుండా చూడాలని కోరారు .అదే విధంగా గత నెల 20 నుంచి ప్రారంభమైన ఎల్సిడిసి కార్యక్రమం ఈనెల 13వ తేదీ వరకు పొడిగించామన్నారు. ఎల్సిడిసి కార్యక్రమంలో జిల్లాలో ఇంతవరకు 10 కొత్త కేసులను గుర్తించామన్నారు. ఈ కార్యక్రమంలో కుష్టి వ్యాధిగ్రస్తులకు మైక్రో సెల్యులర్ రబ్బర్‌తో ప్రత్యేకంగా తయారు చేసిన పాదరక్షలు డాక్టర్ ప్రసన్న చే వ్యాధిగ్రస్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఒ కె.శ్రీనివాస్ ,హెల్త్ సూపర్‌వైజర్ ,హెల్త్ అసిస్టెంట్ కె.వీరభద్ర రావు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


వెల్ల ఆరోగ్య కేంద్రంలో వ్యాధిగ్రస్తులకు పరికరాలు అందజేత

సాగునీరు అందించాలని రైతుల మొర

ప్రజాశక్తి - తాళ్లరేవు

పంట ప్రారంభ దశలోనే సాగునీరు లేక ఎండిపోతున్న పొలాలకు నీరందించి పంటను కాపాడాలని రైతులు కోరారు. మంగళవారం మండలంలోని జార్జిపేట సాగు భూముల రైతులు ఎండిపోతున్న పొలాల వద్ద మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. వేలకు వేలు పెట్టుబడి పెట్టి సాగుకు సిద్ధమైతే ప్రారంభంలోనే నీరు లేక పొలాలు ఎండిపోయాయన్నారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడంలేదన్నారు. జార్జిపేట ప్రాంతంలో ఇప్పటికే సుమారు 20 ఎకరాలు సాగునీరు లేక ఎండిపోయిం దని రైతులు వాపోయారు. అనంతరం రైతులు ఎపి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. ఈ సందర్భంగా రాజబాబు మాట్లాడుతూ శివారు ప్రాంతాల భూముల రైతులకు ఖరీఫ్, రబీ రెండు సీజన్లలోనూ సాగునీటి ఇబ్బందులు తప్పటం లేదన్నారు. ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామని చెప్పిన అధికారులు ఇప్పుడు ముఖం చాటేసారని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ ప్రాంత భూములకు సాగునీరు అందించడానికి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితులకు పరామర్శ

ప్రజాశక్తి - రామచంద్రపురం

పట్టణం లోని 9 వ వార్డ్ లో రోడ్డు ప్రమాదానికి గురైన జుత్తుక గులాం హుస్సేన్ (బాషా) కుటుంబ సభ్యులను వైసిపి ఇన్‌ఛార్జి పిల్లి సూర్య ప్రకాష్ మంగళవారం పరామర్శించారు. అదేవిధంగా వారికి అందిన వైద్య సహాయం ప్రస్తుత పరిస్థితిని తెలుసు కున్నారు. ఆయన తో పాటు 9వ వార్డు కౌన్సిలర్ కోటి శ్రీకన్య దుర్గాప్రసాద్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి హామీకి రూ.2 లక్షల కోట్లు కేటాయించాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో ఉపాధి హామీకి కనీసం రూ.2 లక్షల కోట్లను కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు టేకుమూడి ఈశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం మండల వ్యవసాయ కార్మిక సంఘం సమావేశం సిహెచ్. వెంకటలక్ష్మి అధ్యక్షతన జరిగింది. వ్యవసాయ కార్మికులు, ఉపాధి కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ఈ సమావేశంలో టి.ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.